# అభివృద్ధి, సంక్షేమంలో మనమే ఆదర్శం

- ప్రజల మనస్సుల్లో సీఎం కేసీఆర్ పేరు ప్రతిధ్వనిస్తున్నది
- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- భువనగిరి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 5 : అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అనంతారం, తాజ్‌పూర్, హన్మాపురం, మన్నెవారిపంపు, వడపర్తి, బస్వాపూర్, ముత్తిరెడ్డిగూడెం, వడాయిగూడెం, కునూరు, చీమలకొండూరు, ముస్త్యాలపల్లి, వీరవెల్లి, బండ సోమారం, చందుపట్ల, తుక్కాపురం, గౌస్‌నగర్, నమాత్‌పల్లి, నందనం, అనాజిపూర్‌లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహిళలకు బతుకమ్మ చీరెలు, యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని, ప్రజల గుండెల్లో సీఎం కేసీఆర్ ప్రతిధ్వనిస్తున్నారు. రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పట్టణ పరిధిలోని ఏకే ఫంక్షన్‌హాల్‌లో పైళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ, 1200 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాశ్‌గౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ కంచి మల్లయ్య, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు బల్గూరి మధుసూదన్‌రెడ్డి, అతికం లక్ష్మీనారాయణగౌడ్, సందెల సుధాకర్, ర్యాకల శ్రీనివాస్, అబ్బగాని వెంకట్‌గౌడ్, జడల యశీల్‌గౌడ్, ఒగ్గు శివకుమార్, సిలువేరు మధు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిక

మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు 150మంది ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

## నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి



సుక్కమ్మ కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ అందజేస్తున్న గోలి పింగళ్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 5 : అనారోగ్యంతో బాధపడే నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరుకు చెందిన కవాడి సుక్కమ్మకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల ఎల్ఓసీని గురువారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

భువనగిరి అర్బన్ : పట్టణంలోని 17వ వార్డు చెందిన పానుగంటి నరసింహాచారికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతీమహేశ్ గురువారం లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు గాదె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్‌పై ఆరోపణలు చేస్తే ఊరుకోం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య

మోటకొండూర్, అక్టోబర్ 5 ఆలేరు అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి దంపతులపై కాంగ్రెస్ నేత బీర్ల అయిలయ్య నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని మోరిపిరాలలో దళిత బంధు పంపిణీలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వ విప్ దంపతులపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. అర్హులకే దళిత బంధు వచ్చిందని, బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అయిలయ్య అనతికాలంలోనే వేల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్‌తోనే ఆలేరు నియోజకవర్గంలో దళితులకు గౌరవం పెరిగిందని తెలిపారు.

# ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి

- డీఐఈఓ రమణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ రమణి

భూదాన్‌పోచంపల్లి, అక్టోబర్ 5 : ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ రమణి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పలు రికార్డులను పరిశీలించారు. పాఠ్యాంశాల బోధన, తాగునీటి సౌకర్యం, వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.



బతుకమ్మ చీరె పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు

## ప్రభుత్వ కానుకగా బతుకమ్మ చీరె

- మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 5 : బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు ప్రభుత్వ కానుకగా చీరెలను అందజేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేసి మాట్లాడారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దిడ్డికాడి భగత్, నర్సింగ్ నాయక్, పంగరెక్క స్వామి, అధికారులు పాల్గొన్నారు

## పాలిటెక్నిక్ కళాశాల జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 5 : యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని బాలికల హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపాల్ షఫియాజ్ అక్తర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు మండలానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో సస్పెండ్ చేస్తూ విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. గతంలో వీఆర్ఓగా పనిచేసిన శ్రీనివాస్ గతేడాది వీఆర్ఓల సర్దుబాటులో యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడని తెలిపారు. బుధవారం సాయంత్రం బాలిక చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించగా బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. శాఖపరమైన విచారణకు ఆదేశించామని, నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

- నల్లగొండ జిల్లాలో 7 సీసీఐ కేంద్రాలు
- ఈ నెల చివరి వారం నుంచి కొనుగోళ్లు!
- క్వింటాకు మద్దతు ధర రూ.7,020
- విక్రయాలకు బయోమెట్రిక్ తప్పనిసరి

నల్లగొండ, అక్టోబర్ 5 : పత్తి కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. నల్లగొండ జిల్లాలో జిన్నింగ్ మిల్లులున్న 7 చోట్ల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ఈ నెల చివరి వారం నుంచి కొనుగోళ్లు జరుపనున్నది. మద్దతు ధర క్వింటాకు రూ.7,020 కాగా, విక్రయాల సమయంలో రైతులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో రైతులు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 5,66,850 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. 39,44,251 ఉత్పత్తి వస్తుందన్నది అంచనా.

జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలం సీజన్‌లో పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. దాంతో జిల్లాలో పత్తి కొనుగోళ్ల మార్కెటింగ్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే తొలి దఫాలో పంట వేసిన రైతులకు మైల పత్తి వస్తున్న నేపథ్యంలో ఈ నెల చివరి వారంలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు అయ్యేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 5, 66, 850 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా 39,44,251 క్వింటాళ్ల పత్తి వస్తున్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్‌లో ధరను బట్టి సీసీఐ కేంద్రాలకు పత్తి ఏ మేరకు వస్తుందో అనేది తెలుస్తుంది. అయితే ప్రస్తుతం తొలి దశలో వచ్చే పంట పెద్దగా క్వాలిటీ లేకపోవడంతో రైతులు అక్కడక్కడా క్వింటాకి రూ.6,300 నుంచి రూ.6,800 వరకు విక్రయిస్తున్నారు. రెండో దశలో ఏరే పత్తి క్వాలిటీ వస్తే బహిరంగ మార్కెట్‌లో ధరను బట్టి సీసీఐ కేంద్రాల ఉనికి తెలుస్తున్నది. అయితే తక్కువ ధరకు దళారులకు అమ్మి మోస పోవద్దని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

### బయోమెట్రిక్ తప్పనిసరి..

పత్తి విక్రయించాలి అనుకునే రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి కేంద్రంలో బయోమెట్రిక్ తప్పని సరి చేశారు. మొదట బయోమెట్రిక్ అయిన తర్వాతనే పత్తి కొనుగోలు చేసి ఆ తర్వాత పాస్ బుక్‌లు, బ్యాంక్ ఖాతాలు తీసుకొన్నారు.ఈ సీజన్‌లో జిల్లాలో ఈ ఏడాది 5.66 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా 39.44 లక్షల క్వింటాళ్ల పత్తి ఉత్పత్తి కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో మార్కెటింగ్ శాఖ యంత్రాంగం మానిటరింగ్‌తో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం నల్లగొండతో పాటు మల్లేపల్లి, మాల్, చండూర్, నకిరేకల్, చిట్యాల, శాలిగౌరారం జిన్నింగ్ మిల్లులు ఉండటంతో ఆక్కడ సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మల్లేశ్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న సత్యం

## అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీ

వలిగొండ, అక్టోబర్ 5 : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు నోముల మల్లేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చిల్లర స్వామి, ఉపాధ్యక్షుడు ఆవుల నర్సింహకు మహాసభ జిల్లా అధ్యక్షుడు చుక్కల సత్యం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గుండెబోయిన అయోధ్య యాదవ్, డేగల పాండుయాదవ్, ఆవుల స్వామి, వనగంటి రామహరి, గంగుల శ్రీనివాస్, జినుకల దానయ్య పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

నీలగిరి, అక్టోబర్ 5. నల్లగొండ పట్టణంలోని 21వ వార్డులో యశోద దవాఖాన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో సుమారు 451 మందికి పైగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్ పర్వత్ ఫర్హానా ఇబ్రహీం పాల్గొన్నారు.

## నేడు సూర్యాపేటలో మహా ప్రస్థానం ప్రారంభం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 5 : సూర్యాపేటలోని మహా ప్రస్థానం సేవలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సకల వసతులు, అత్యాధునిక సౌకర్యాలతో రూ 4.20 కోట్లతో ఆధునీకరించిన మహా ప్రస్థానం సేవలకు సిద్ధంగా ఉన్నది. ఈ మేరకు గురువారం మంత్రి జగదీశ్‌రెడ్డి మహా ప్రస్థానాన్ని పరిశీలించారు. కాటి కాపరులతో సమావేశమై అంత్యక్రియలకు రూ.6 వేలుగా రుసుము నిర్ణయించారు. ఈ ఫీజు రాష్ట్రంలోనే అతి తక్కువగా ఉన్నది. అలాగే అద్దె ఇండ్లలో ఉండే వారి ఇంట్లో ఎవరైనా చనిపోతే అతి తక్కువ ఫీజుతో పది మంది కుటుంబ సభ్యులు ఉండేలా రెండు కాటేజీలను సిద్ధం చేశారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహాజన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి ప్రకాశ్, వల్దాస్ జానీ పాల్గొన్నారు.